ప్రభుత్వ భూములపై కన్ను

● భూమాతను చెరబడుతున్న భూ కబ్జాదారులు
● చెరువులు, శిఖం భూములను వదలని భూబకాసురులు


మంగపేటలో కబ్జాకు గురైన మామిడికుంట చెరువు

మంగపేట: మండలంలో భూబకాసురులు ప్రభుత్వ భూములు, చెరువులు, శిఖం భూములను కబ్జా చేస్తూ భూమాతను చెరబడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలను పలువురు అక్రమంగా కబ్జా చేసి ఇళ్లను నిర్మించుకున్నారు. కొందరు తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేశారు. మరికొందరు ప్లాట్లుగా చేసి ఒక్కో గుంటకు రూ.5 లక్షల చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. కబ్జాదారులపై ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. మండలంలో 130 చెరువులు, కుంటలకు చెందిన సుమారు 600 ఎకరాలకు పైగా శిఖంభూమి కబ్జాకు గురైనట్లు అంచనా వేశామని ఇరిగేషన్ అధికారులు చెప్పడం గమనార్హం. మండల కేంద్రం పరిధిలో రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 107, 125తో పాటు మరో 44 సర్వే నంబర్లపై 2010 ఎరాల ప్రభుత్వ భూమి ఉండాల్సి ఉండగా ప్రస్తుతం పట్టుమని 10 ఎకరాలు కూడా లేదు.

ఇళ్ల స్థలాలకు పెరిగిన డిమాండ్

మండలకేంద్రం రోజు రోజుకు అభివృద్ధి చెందుతుండటంతో ఇళ్ల స్థలాలకు రెక్కలొచ్చాయి. దీంతో కబ్జాదారుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా కబ్జా రాయుళ్లు పాగా వేస్తున్నారు. గంపోనిగూడెంలోని మామిడికుంట చెరువు పూర్తిగా కబ్జాకు గురి కాగా ఇక్కడ భవన నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. ఇరిగేషన్ ఇటు రెవెన్యూ అధికారుల చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్ర

ఏజెన్సీ ప్రాంతమైన మంగపేటలో 1/70, ఎల్టీఆర్, పీసా చట్టాలు అమలులో ఉన్నప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిని భూబకాసురులు కబ్జాలకు చేసి దర్జాగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఆయా నిర్మాణాలకు పంచాయతీ అధికారులు ఇంటి నంబర్లు ఇస్తున్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటంతో తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై స్థానికులు, ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాలు అధికారులకు పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని వారి కనుసన్నల్లోనే ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ముఖ్యంగా సెలవు రోజుల్లోనే కబ్జా స్థలాల్లో రాత్రికి రాత్రి వెలుస్తున్న తాత్కాలిక గుడిసెలను అధికారులు తొలిగించకపోవడంతో రెవెన్యూ అధికారులపై వస్తున్న ఆరోపణలు నిజమనే అనుమానం కలుగుతోంది.

హైడ్రా తరహాలో చర్యలు తీసుకోవాలి



తహసీల్ ఎదుట, కార్యాలయ పరిసరాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములతో ఇప్పటికే కబ్జాకు గురయ్యాయి. ఈ విషయంపై ఐదేళ్లుగా తహసీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా. నేటికి ఫలితం లేకుండా పోయింది. ఏజెన్సీ చట్టాల నిబంధనలను అధికారులు అమలు చేయకపోవడం కబ్జాకు ప్రధాన కారణం.

– తాటి నాగరాజు, ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ప్రధాన కార్యదర్శి

సమన్వయంతో పనిచేయాలి

● యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్


సమావేశంలో మాట్లాడుతున్న ఇస్సార్‌ఖాన్

ములుగు : యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్‌ఖాన్ అన్నారు. శనివారం ములుగులో ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజల్లోకి వెళ్లి వివరించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ నాయకులు కీలకపాత్ర వహించాలన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సుమన్‌రెడ్డి, నాయకులు జక్కుల రేవంత్, నేపాల్‌రావు, అన్వేష్, వంశీకృష్ణ, శ్రావణ్, బండి మధు, అభినయ్ చారి, రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందనామస్మరణతో నగర సంకీర్తన


బోరునర్సింగాపూర్‌లో గోదాదేవి అమ్మవారి చిత్రపటంతో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

మంగపేట: మండలంలోని బోరునర్సాపురం సీతారామచంద్రస్వామి ఆలయంలో కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భక్తులు గ్రామంలో గోవింద నామస్మరణతో నగర సంకీర్తన కార్యక్రమాన్ని శనివారం అత్యంత భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో శనివారం చివరి వారం కావడంతో ఆలయ కమిటీ నిర్వాహకుల ఆ ధ్వర్యంలో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామంలోని వీధుల్లో గోదాదేవి అమ్మవారి చిత్రపటం, కలశంతో గోవిందనామాన్ని స్మరిస్తూ నగర సంకీర్తన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలోని సీతారామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజనేయ స్వామికి అర్చకులు జీడికంటి మధుసూదనాచారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమం అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు శఠారితో ఆశీర్వచనం ఇచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు నర్రా శ్రీధర్, కడియాల సుదర్శన్‌నాయుడు(పటేల్), సారయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కార్మికులు

టేకుమట్ల: తెలంగాణ నేతన్నలకు పొదుపు, భరోసా, భద్రతా పథకంలో రూ.163 కోట్ల నిధులను విడుదల చేసినందుకు శనివారం మండల కేంద్రంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మాచర్ల మహేందర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. చేనేతల కుటుంబాలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు మాచర్ల రాజేష్, దూడం రాములు, మాచర్ల మొగిళి, రవి, పోసాలు, శంకర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగలి దుక్కిటెద్దుల మృతి



వెంకటాపురం(ఎం) : వన్యప్రాణుల నుంచి పంటను రక్షించుకునేందుకు పంట చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి రెండు దుక్కిటెద్దులు మృతి చెందిన సంఘటన మండలంలోని కేశవపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పల్లవేని రవి వరిగడ్డి తెచ్చేందుకు ఎడ్లబండి కట్టుకొని తనపాలం వైపు వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన ఒక రైతు గ్రామసమీపంలోని బుచ్చికుంట శివారులో తన పొలం చుట్టూ అమర్చిన విద్యుత్ తీగలకు తగలి దుక్కిటెద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఎడ్లబండిలో ఉన్న రవితో పాటు మరో రైతు తిరుపతి ఎడ్లబండి నుంచి దూకి దూరంగా పారిపోయారు. సదరు రైతు నుంచి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత రైతు రవి ఫిర్యాదు చేశాడు.

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయండి


అంబేడ్కర్ సెంటర్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వెంకటాపురం(కె): ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి డప్పులు, లక్ష గొంతుకల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మడిపల్లి శ్యామ్‌కుమార్, వావిలాల సాంబశివరావు, తోకల శివ, వేల్పుల మల్లేష్, గుగ్గిళ్ల నరేంద్ర, యాసం మహేష్, మల్లికార్జున్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కులస్తుల అభివృద్ధికి కృషి

● వడ్డెర కులస్తుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజేందర్

భూపాలపల్లి రూరల్: వడ్డెర కులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని వడ్డెర కులస్తుల సంఘం ఉపాధ్యక్షుడు విజేందర్, కన్వీనర్ రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పక్కన ఓబన్న జయంతి సందర్భంగా శనివారం పట్టణ అధ్యక్షుడు మిర్యాల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి అల్లెపు రవి ఆధ్వర్యంలో సంఘం నాయకులు జెండా ఆవిష్కరించారు. అనంతరం ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా వడ్డెర కులస్తుల బతుకులు మారడం లేదన్నారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గణపురం మండల అధ్యక్షుడు శివరాత్రి సారయ్య, జిల్లా వడ్డెర సంఘం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

● ములుగు ఎస్సై వెంకటేశ్వర్‌రావు
● రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ


ములుగు : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

ములుగు/మంగపేట/కన్నాయిగూడెం: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ములుగు, మంగపేట, కన్నాయిగూడెం ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, టీవీఆర్ సూరి, వెంకటేశ్ అన్నారు. ఆయా మండల కేంద్రాల్లో శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగపేటలో పోలీసులు ఆటోడ్రైవర్లతో కలిసి సుమారు 60 ఆటోలు, టాటా మ్యాజిక్‌లతో పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా గంపోనిగూడెం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటోలు నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, అధిక వేగం అజాగ్రతగా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణం కాకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా ప్రస్తుతం జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా చిన్న పిల్లకు సెల్‌ఫోన్ ఇవ్వొద్దని ఇచ్చినట్లతే తద్వారా కలిగే నష్టాలను క్షున్నంగా వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సైలు రామకృష్ణ, లక్ష్మారెడ్డి , సురేష్, ప్రొబిషనరీ ఎస్సై శ్రీకాంత్, మహేష్, స్టేషన్ సిబ్బంది సూర్యనారాయణ, మోహన్, తా తారావు, ఆటోడ్రైవర్స్ యూనియన్ మండల వైస్ ప్రెసిడెంట్ ఎర్రం నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడ్డం శోభన్, కోటేశ్వర్‌రావు, ముకుందం, అబ్బాస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


మంగపేట : ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సూరి


కన్నాయిగూడెం : వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్

మొగుళ్లపల్లి: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ఎస్సై అశోక్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా పోలీస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో ప్రజలకు, వాహనదారులకు రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపినట్లయితే చర్యలు తప్పవన్నారు. ఈ ఏఎంవీఐ సుందర్ నాయక్, శ్రీనివాస్ ఏఎస్ఐ రాజేశం, కానిస్టేబుల్ సారంగపాణి, కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుపైనే వారసంత


సంతలో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని బొడ్రాయి నుంచి పాత బస్టాండ్, కూరగాయల మార్కెట్ రోడ్లపైనే శనివారం వార సంత నిర్వహించడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంత వల్ల పలు రకాల షాపులను రోడ్డుకు ఇరువైపుల ఏర్పా టు చేయడంతో వాటిని కొనుగోలు చేసే ప్రజలు రోడ్లపైనే నిలబడి కొనుగోలు చేయాల్సి వస్తోంది. అలాగే వాహనదారులు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఏదైనా వాహనం అ దుపు తప్పిదే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. గతంలో రామాలయం ఆవరణలో సంత జరిగేదన్నారు. ఇప్పుడు కూడా అక్కడే నిర్వహిస్తే రోడ్లపై ఎలాంటి షాపులు లేకుండా ఉంటాయని స్థానికులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి సంతను మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

పార్కింగ్‌కు స్థలం సరిపోవడం లేదు



సంత వల్ల వాహనాలు రోడ్లపై నిలిపివేయడం, వచ్చి పోయే వాహనాలు వెళ్లేందుకు స్థలం సరిపోవడం లేదు. షాపుల యజమానులు, కొనుగోలు చేసే వ్యక్తులు అందరు కూడా రో డ్లపై ఉండడంతో ఇబ్బందిగా ఉంది. ప్రత్యేకమైన స్థలం ఏర్పాటు చేసి సంత నిర్వహించాలి.

– గొడిశాల శ్రీనివాస్, ఏటూరునాగారం

క్రిప్టో కరెన్సీ కలకలం..!

● హైదరాబాద్‌లో నెల్లుట్ల వాసి అరెస్టు


కుర్రెంల రమేశ్

లింగాలఘణపురం: క్రిప్టో కరెన్సీ పేరుతో నకిలీ వెబ్‌సైట్ క్రియేట్ చేసి రూ.95 కోట్లు కొల్లగొట్టిన కేసులో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన కుర్రెంల రమేశ్‌ను సీఐడీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఘటనతో గ్రామంలో కలకలం మొదలైంది. అంత పెద్ద మొత్తంలో మోసం చేసిన వ్యక్తి ఎవరంటూ పలువురు ఆరా తీయడం ప్రారంభించారు. సుమారు 25 ఏళ్ల క్రితం గ్రామం నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లిన రమేశ్ అక్కడ బుక్‌స్టాల్‌లో కొంత కాలం పనిచేసి తర్వాత స్వతహాగా బుక్‌స్టాల్ ఏర్పాటు చేసుకున్నాడని, అలాగే కారుడ్రైవర్‌గా పని చేశాడని చెబుతున్నారు. అక్కడే ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడని, బంధువులు చనిపోయిన సమయంలో.. ఇతర శుభ కార్యాలకు వచ్చిపోయే రమేశ్ ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవాడు కాదని తెలుస్తోంది. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే తక్కు వ సమయంలో ఎక్కువ మొత్తం వస్తాయని ఆశచూపి 45 మంది వద్ద రూ.95 కోట్లు కొట్టేశాడని సీఐడీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం శనివారం గ్రామస్తులకు తెలిసింది. ఎప్పుడో ఊరు నుంచి వెళ్లిన వ్యక్తి పేరు ప్రసార మాధ్యమాల్లో మార్మోగడం చర్చనీయాంశంగా మారింది.

13న వాలీబాల్ టోర్నమెంట్

కాళేశ్వరం: మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 13న మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌ను మాజీ ఎంపీటీసీ రెవెల్లి మమతనాగరాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఇమ్రాన్, బన్నీ, శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలుగా ప్రకటించినట్లు తెలిపారు. మండలస్థాయి టో ర్నమెంట్‌కు ఆధార్‌కార్డు తప్పనిసరి తీసుకురావాలని సూచించారు. 80080 69576, 77805 93127 నంబర్లలో సంప్రదించి టీం పేర్లు ఎంట్రీ చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

బీజేపీ మండల అధ్యక్షుడిగా చక్రవర్తి



ఏటూరునాగారం : మండల కేంద్రానికి చెందిన వినుకోలు చక్రవర్తిని బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ పి. విజయ చందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని తెలిపారు. అలాగే తన ఎంపికకు సహకరించిన వి జయ చందర్‌రెడ్డి, బలరాంకు కృతజ్ఞతలు తెలిపారు.

గుండెపోటుతో రైతు మృతి


లక్ష్మీనర్సు (ఫైల్)

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెంలో ముదురుకోళ్ల లక్ష్మీనర్సు (59) రైతు గుండెపోటుతో మృతి చెందాడు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని బుట్టాయిగూడెంకు చెందిన లక్ష్మీనర్సు శుక్రవారం తనకున్న వ్యవసాయ పంటపొలంలో పనిచేసి రాత్రి పడుకున్న క్రమంలో ఛాతిలో తీవ్రమైన నొప్పి రావడంతో ఇంట్లో ఉన్న కొడుకులకు చెప్పగా 108 వాహనంలో ఏటూరునాగారం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు.

సేవలను గుర్తించాలి



కన్నాయిగూడెం : పోలీసుల సేవలను గుర్తించి ప్రతి ఒక్కరూ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలపాలని ఎస్సై వెంకటేశ్ కోరారు. తెలంగాణలో పోలీసులు చేస్తున్న సేవలపై పోలీస్ స్టేషన్‌లో పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

ఓబన్నకు ఘననివాళి



ములుగు: దేశభక్తి చరిత్రలో వడ్డే ఓబన్న సముచిత ఖ్యాతి పొందారని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని సంక్షేమ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట వెంకటస్వామి, నాయకులు గొల్లేన సంతోష్, శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ ఉద్యోగులు రేణుక, మానస, సరిత, కుమారస్వామి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని పంబాపూర్‌కు చెందిన ఎల్లబోయిన పవన్ కల్యాణ్ (25) అనారోగ్యంతో మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భిక్షపతి కుమారుడు పవన్ కల్యాణ్ ఈనెల 9న మేడారం అమ్మవార్లను దర్శించుకునేందుకు వెళ్లాడు. అదే రోజు రాత్రి 11 గంటలకు పంబాపూర్‌కు వెళ్లి అనంతరం 12 గంటలకు మొక్కజొన్న చేనుకు కాపాలా కోసం వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు మొక్కజొన్న చేను వద్దకు వెళ్లి చూడగా పవన్ కల్యాణ్ చేతులు కాళ్లు బిగుసుకుపోయి కనిపించాడు. వైద్య పరీక్షల కోసం కాటాపూర్‌లోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో ములుగు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తండ్రి భిక్షపతి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

‘వేదవ్యాస’లో సంక్రాంతి సంబురాలు



వెంకటాపురం(ఎం): స్థానిక వేదవ్యాస ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముందస్తు సంక్రాంతి సంబురాలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు పోశాల వీరమల్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. పాఠశాల ఆవరణలో బసవన్న విన్యాసాలు విద్యార్థులను కనువిందు చేశాయన్నారు, విద్యార్థుల వేషధారణతో హరిదాసు కథలు, భోగి మంటలతో సంబురాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు సూర్యప్రకాష్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.